

నగుతున్నది.

''అయ్యా.. అమ్మ కూడా బువ్వ తినలే!''.

''ఇయాల మీయమ్మ బువ్వ తినదు. ఒక్కపొద్దు''.

''ఒక్కపొద్దంటే..!?''.

''అంటే.. పోషమ్మకు నైద్యం పెట్టేవరకు ఏం తినదు''..

పిలగాడు నోట్లో ముద్ద పెట్టుకుని పద్మవైపు తిరిగి..

''అవునా అమ్మా'' అన్నడు.

''అవును!' అన్నట్టుగా తలూపింది పద్మ.

దేవయ్య వైపు తిరిగి..

''మల్ల, నువ్వెందుకు తింటున్నవ్!?'' అన్నడు పిలగాడు.

పద్మకు కిసుక్కున నగొచ్చింది. దేవయ్య నోట్లో ముద్ద పెట్టుకొని నములుకుంటా..

''ఇంట్ల ఒక్కరే ఉండాలె''.

''అట్లయితే నువ్వుండు.. అమ్మ తింటది!''.

''ఇగో.. నాది తినేది అయిపోయింది''.

''అట్లయితే నేనుంటా!''.

''చిన్న పిల్లలు ఉండొద్దు. అయినా నువ్వు కూడా తిన్నవు''.

''మల్ల నాకెందుకు తినిపించినవ్!?''.

''అవుతల నాకు శానా పనులుండయి.. ఇకడ్రా'' అంటూ.. పిలగాని చేయి కడిగి, దేవయ్య చేయి కూడా కడుక్కుని, గిన్నెను పద్మ ముందలికి తోసిండు. పద్మ కుండల బెల్లమేసి, బయటికిపోయి గిన్నె కడుక్కొచ్చింది. తండ్రికొడుకులిద్దరూ బయటున్న బంతిపూలు, బంగారు మల్లెలు ఇంకొన్ని పూలు తెంపుకొచ్చి గుడిశెల పోసింద్రు.

దేవయ్య తప్పెట భుజానికి వేసుకొని..

''పద్మా.. నేను పోతున్న'' అన్నడు.

''ఆ.. సరే!''.

''అయ్యా! నాకో రూపాయి ఇయ్యే''.

''ఒక్కపొద్దు ఉంటాన్నవు! మల్ల రూపాయెందుకు!?''.

పిలగాడు అలిగి, అమ్మవైపు చూసిండు. పద్మ దేవయ్యవైపు చూసింది. జోపిల నుంచి రూపాయి తీసిచ్చి, నగుకుంట పోయిండు.

''నేను ఏపిచ్చుకొచ్చుకుంటా'' అంటూ పిలగాడు ఊళ్లెకు ఉరికిండు.

కొంతసేపటికి పిలగాడొచ్చి, పద్మ బోనం జేస్తుంటే చిత్రంగా చూస్తుండు. బోనం కుండకు కిందినుంచి సగం వరకు సున్నం రుద్దింది. ఇప్పుడు కుండ సగం నలుపు, సగం తెలుపైంది. ఆపైన నల్లదానికి నూనె పూసి, దానిమీద పసుపుకుంకుమ బొట్లు పెట్టింది. గురిగికి కూడా అట్లనే చేసి, దాంట్ల కొంచెం చింతపులుసు పోసింది. తెంపుకొచ్చిన పూలను అల్లి బోనానికి పైన చుట్టింది. గుడిశె మధ్యలో కొన్ని వొడ్లు పోసి, దానిమీద బోనంకుండ వెట్టి తల్లికొడుకులిద్దరు మొక్కింద్రు.

ఊళ్లె హడావుడి మొదలైంది. ఈలలు అరుపులతో ఊరు తిరుగుతున్నరు. పిలగాడు కూడా.. 'నేను చూసొస్త!' అని ఉరికిండు.

ఈ ఊళ్లె బోనాల పండుగ ఉన్నట్టు, ఏ ఊళ్లె ఉండదు. తొల్త కోట మశమ్మను చేస్తరు. ఊరుమీద ఇడిసిన దున్నపోతును పట్టుకొచ్చి, ఊరంతా తిప్పి, కోట మశమ్మ కాడ బలిస్తరు. మల్త రోజు పోషమ్మకు బోనం పెడ్తరు. కానీ ఈ ఊళ్లె, రెండు బొడ్రాళ్లు, రెండు పోషమ్మ గుళ్లు ఉంటయి. ఒకటేమో సూదరోల్లది, ఇంకోటి మాదిగోల్లది. తొల్త సూదరోల్ల (ఎక్కువ కులం) పోషమ్మకు బోనంబెట్టి, తర్వాత మాదిగోల్ల పోషమ్మకాడికి వస్తరు. ఆ మల్త రోజు చెరువు కట్టమీద ఉన్న కట్ట మశమ్మకు నేవేద్యం పెట్టి, తెప్పలో మేకను కట్టి చెరువులో ఇడుస్తరు. మేక వెళ్లే దిక్కును బట్టి, ఆ ఏడాది ఎట్ల ఉండబోతుందని జాతకం చూస్తరు. దాంతో పండుగ అయిపోతది. ఈ మూడు దినాలు కోలాటాలు బొడ్డెమ్మలు, తాగుడు తినుడు, చుట్టాలతోని ఊరంతా కళకళలాడుతది.

సూదరోల్ల బోనాలు అయిపోయే వరకు సాయంత్రమయింది. పిలగాడు ఉరుకొచ్చి..

''అమ్మా.. తప్పెట తీస్కొని అయ్యొస్తుండు'' అని చెప్పిండు.

పద్మ.. కోడి కాళ్లురెక్కలు కట్టి పిలగానికి ఇచ్చింది. ఇంతలో బైనోండ్లతోపాటు దేవయ్య, వీరయ్య, మల్లయ్య భుజాలకు తప్పట్లేసుకుని వచ్చింద్రు.

పద్మ బోనానికి మొక్కి, నెత్తిన పెట్టుకొని బయటకొచ్చింది. బోనం ఎత్తుకున్నోళ్లను పోషమ్మతల్లిగా భావిస్తరు. పైగా పెద్ద మేతరి బోనం, దాన్నే తొల్త తీస్తరు.

'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.2 వేల బహుమతి పొందిన కథ.